క్లుప్తంగా...

అక్షరాల రూ.లక్షన్నర



చార్మినార్: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఖుర్బానీ ఇచ్చేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో మేకలు, గొర్రెలు, పొటేళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో విలైతీ అనే హైబ్రీడ్ పొటేలు అందరినీ ఆకర్షిస్తోంది. దీని ఖరీదు రూ.1.50 లక్షలుగా వ్యాపారులు పేర్కొన్నారు. పంజాబ్‌లోని పటాన్‌కోట్ నుంచి తెప్పించిన ఈ పొటేలు ఇప్పటికే అమ్ముడు పోయినప్పటికీ ప్రదర్శనలో ఉంచినట్లు వారు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

గోల్కొండ: పనులను సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం టోలిచౌకిలోని తన కార్యాలయంలో అధికారులు, మజ్లిస్ నాయకులతో మాట్లాడారు. పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేనందునే పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులపై స్థానిక మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు పర్యవేక్షిస్తూ వాటి వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, జలమండలి, బల్దియా అధికారులు, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. బేలా ముత్యాలమ్మ ఆలయం, శాలిబండ శ్రీ బంగారు మైసమ్మ ఆలయం, హరిబౌలి శ్రీ మాతేశ్వరి పోచమ్మ, మహంకాళి ఆలయంలోని అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ భరత్ ప్రకాశ్, రమేశ్ బాబు, శేఖర్ యాదవ్‌లు వేర్వేరుగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అక్కన్న మాదన్న ఆలయ కమిటీ సభ్యులను ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు జి.రాజారత్నం, కె.దత్తాత్రేయ, ఎ.సతీష్ కుమార్, ఎస్.పి.క్రాంతి కుమార్, జగన్ మోహన్ కపూర్, జి.శ్రీనివాస్, జి.దినేశ్, పి.గోపాల్ యాదవ్, మహేశ్, రజత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గా హోమం

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారి సన్నిధిలో గురువారం దుర్గా హోమం నిర్వహిస్తున్నట్లు గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆరెళ్ల జగదీష్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం అమ్మవారికి మూడవ పూజా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు ప్రధాన పూజారి సర్వేశ్వర్ చారి ఆధ్వర్యంలో దుర్గా హోమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పీస్ కమిటీ సమావేశం

మియాపూర్: బక్రీద్, బోనాల పండగ సందర్భంగా మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్, హాఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో పోలీసులు సమావేశమయ్యారు. పండగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో డివిజన్ బీజేవైఎం ఆధ్వర్యంలో యువ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో 18 ఏళ్లు నిండిన యువకులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించారు. కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు మాణిక్‌రావు, బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జితేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, డివిజన్ దళిత మోర్చ అధ్యక్షులు ప్రభాకర్, జితేందర్, మహేష్‌యాదవ్, వెంకట్, బాషా, విశాల్, రాజు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు పాడవుతాయి

నార్కోటిక్స్ ఎస్పీ మురళీకృష్ణ



ఎంజీఐటీలో డ్రగ్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు

మణికొండ: యుక్త వయసులో డ్రగ్స్ వాడటం వల్ల శరీర భాగాలు చచ్చుబడి, మెదడు సరిగా పనిచేయక, ఏ పనిపైనా శ్రద్ధ లేకుండా పోయి జీవితాలు పాడవుతాయని సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ గ్వాలియర్ హెడ్ క్వార్టర్ సభ్యుడు, ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో బుధవారం నిర్వహించిన నార్కోటిక్స్ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడే వారిని వాటికి దూరంగా ఉండేలా చేయడానికి వారికి ఆలంబనగా నిలవాలన్నారు. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్లు హేమకుమార్, జీఎస్.ఖాన్, సంజయ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ డి.రేఖయాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, డా.ఎం. రవిచందర్, డా.సీహెచ్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల సమస్య పరిష్కరించండి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు కొండె మహేష్‌యాదవ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న రోడ్ల సమస్యపై వినతిపత్రం అందజేసేందుకు కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న కాలనీలు, బస్తీలతో జనాభా సైతం భారీగా పెరిగిపోయిందన్నారు. ప్రతి రోజు రహదారులపై వేలాది వాహనాలు ప్రయాణిస్తుండడంతో కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. గుంతలరోడ్లపై ప్రయాణిస్తు వాహనదారులు తరచు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బి.మహాలింగంగౌడ్, కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ శేఖర్‌ముదిరాజ్, పీఎస్ మల్లారెడ్డి, నరేష్‌యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు నర్సింగరావు, నర్సింహ, ప్రవీణ్, వెంకటచారి, విష్ణు, పవన్, సాయి తదితరులున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు

అభివృద్ధిని చూసి బీజేపీని ఆదరిస్తున్నారు

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



హుడా కాలనీలో ఇంటింటికి బీజేపీలో పాల్గొన్న నాయకులు

మణికొండ: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు పార్టీని ఆదరిస్తున్నారని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీ, భాగ్యలక్ష్మికాలనీలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా పేదలకు ఉచిత రేషన్‌ను అందిస్తుందని, ఆ పథకాన్ని పలు రాష్ట్రాలలో తమ ఘనతగా ఆ ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, కౌన్సిలర్‌లు ఎల్.వందన, బి. శ్వేత రవికాంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు జె.సిద్ధప్ప, జె.లక్ష్మీ రాములు, నాయకులు సీహెచ్.ఇందిర, ఎం.రాఘవ రెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, శంకర్‌సింగ్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

అవసరాల మేరకే విద్యుత్ వినియోగించాలి

మణికొండ: మన అవసరాల మేరకే విద్యుత్‌ను వాడాలని, డబ్బును ఎంత పొదుపుగా ఖర్చు చేస్తామో అదే పద్ధతిలో విద్యుత్‌ను వినియోగించాలని సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బుధవారం విద్యుత్ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఎనర్జీ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో లైట్లు, ఫ్యాన్‌లు, ఏసీలు అనవసరంగా వాడొద్దన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ బి.సురేష్‌కుమార్, అధ్యాపకులు ఉమాకాంత్‌చౌదరి, డి.కృష్ణారెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎనర్జీవాక్‌లో సీబీఐటీ అధ్యాపకులు, విద్యార్థులు

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని పూరి జగన్నాథ్ దేవాలయంలో రథయాత్ర ముగింపు పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి చల్లని ఆశీస్సులు, దీవెనలతో ప్రజలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని స్వామి వారికి వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో రాంచందర్, ఆలేటీ శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మిదర్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, గోపాల్, దేవేందర ప్రతాప్,హిమాన్ష్, సిదెశ్, సబ్రోత్, పూరి జగన్నాథ రథ యాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన కమిటీ సభ్యులు

ఘనంగా పీవీ జయంతి



పీవీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వీసీ వి.రవీందర్‌రెడ్డి

ఏజీవర్సిటీ: మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం పరిపాలనభవనంలోని పీవీ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ వి.రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మహనీయుని పేరుతో వెలసిన ఈ విశ్వవిద్యాలయాన్ని వారి పేరుకు తగినట్టుగా అభివృద్ధి చేయడంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఆటో ఢీ.. వృద్ధునికి గాయాలు

మణికొండ: రోడ్డుపై నడుచుకుంటూ వెలుతున్న వృద్ధుడిని చెత్త ఆటో ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాలగూడ గ్రామానికి చెందిన సంగం ఇంద్రయ్య ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెలుతుండగా వెనక నుంచి వచ్చిన చెత్త ఆటో ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఫిర్యాదు చేయటంతో సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంజీఐటీలో యువ ఉత్సవాలు



యువ ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

మణికొండ: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ సారధ్యంలోని జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో బుధవారం యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌వైకేఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎఆర్. విజయరావు, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీరజ, ఐసీడీఎస్ సీపీడీఓ లక్ష్మీబాయిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ సంస్థలు సమాజాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్, స్టూడెంట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపు ప్రకారం పంచ్ ప్రాన్ అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాంసం వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేయాలి

రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా వెలువడే వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లల్లో వేయాలని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో పడవేయకుండా ఇంటి వద్దకు వచ్చే కార్మికులకు అందించాలన్నారు. పరిసరాల శుభ్రత ముఖ్యమన్నారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, ఫైజల్ ఖాన్, సోనుభాయ్, మహ్మద్ ఫియాజ్ తదితరులు పాల్గొన్నారు.



కవర్లను పంపిణీ చేస్తున్న మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్

ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

బండ్లగూడ: వ్యర్థాలను చెత్తసేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు కార్పొరేటర్ కె.పద్మాపతిపాపయ్యయాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో, ఈద్గాల వద్ద బక్రీద్ వ్యర్థాలను వేసేందుకు ప్లాస్టిక్ కవర్లు పంపిణీ చేశారు. బదూరుద్దీన్ మజీద్ కమిటీ, ఇమామ్‌సాబ్ ఆఫ్ అలంగీర్ మజీద్, ఉస్మాన్ మజీద్, జీద్ మహమ్మదీయ జాయిబున్నీసా మజీద్, ఫాతీమా మజీద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఅండ్‌టీ కాలనీ అధ్యక్షుడు నదీమ్, అబ్దుల్ హఫీజ్‌ఖాన్, మిస్బావుద్దీన్, ఆలీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచవటిలో వీధికుక్కల వీరంగం



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో వీధి కుక్కలు వీరంగం వేస్తున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో వాహనాలు, సైకిళ్లపై వెల్లే వారి వెంట పడి కరుస్తున్నాయ స్థానికులు వాపోతున్నారు. ఉదయం సమయంలో వాకింగ్‌కు వెళ్లే వారి వెంట పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కాలనీలో పేపర్‌బాయ్‌ని వెంటపడి కరిచాయని తెలిపారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

శంషాబాద్: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో కంగారూ కిడ్స్ పాఠశాల ఎదుట ధర్నా చేశారు. అనుమతులు లేకుండా పాఠశాల కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఓ నంబరు- 1 ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించేందుకు అనుమతి లేనప్పటికీ ప్రతి ప్రయివేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు వీరికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె. వై ప్రణయ్, జయశ్రీ, ప్రసాద్‌చారి, కౌశిక్, తరుణ్, శ్రీకాంత్, హర్ష , చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

బండ్లగూడ: దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మేకల ప్రవీణ్‌కుమార్‌యాదవ్ అన్నారు. హైదర్షాకోట్‌లో నూతనంగా నిర్మిస్తున్న గాలి పోచమ్మ దేవాలయ నిర్మాణానికి ఆయన రూ.1,01,000 విరాళంగా చెక్కురూపంలో బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ అందరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సదానందంగౌడ్ పాల్గొన్నారు.



టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యదర్శిగా అనిల్‌యాదవ్



రాజేంద్రనగర్: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర కార్యదర్శిగా అనిల్‌యాదవ్ నియమితులయ్యారు. బుధవారం శంషాబాద్‌లోని టిఎస్ఎస్ఓ కార్యాలయంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టిఎస్ఎస్ఓ) వ్యవస్థాపకులు లక్ష్మినివాస్ అనిల్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

మణికొండ: ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందని, యువతులు తప్పనిసరిగా నేర్చుకోవాలని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో చైతన్య సురక్ష మహిళా భద్రతా క్లబ్ ఆధ్వర్యంలో స్వీయ రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలకు చిన్నప్పటినుంచే ఇలాంటి క్రీడలను నేర్పిస్తే వారు ఆత్మస్థైర్యంతో జీవిస్తారన్నారు. తైక్వాండో జాతీయ క్రీడాకారిణి కుమారి కీర్తన షణ్ముగ సుందర్ యువతులకు ఆత్మరక్షణ మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డైరెక్టర్ పివి రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మి, డాక్టర్ బి. ఇందిర, డాక్టర్ మాధవీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.



మెళకువలు నేర్చుకుంటున్న విద్యార్థినులు

ప్రతిష్టాత్మకంగా బోనాల జాతర

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతరను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చార్మినార్ ఈస్ట్ కోట్లా ఆలిజాలోని శ్రీ కోట మైసమ్మ ఆలయం కమిటీ చైర్మన్ రాయికోటి బాబురాజా తెలిపారు. జూలై 7న ఉదయం శ్రీ మాతేశ్వరి కలశ స్థాపన, 14న ఉదయం 6.01 గంటలకు శ్రీ మహంకాళి మహాభిషేకం, 9.01 గంటలకు శృంగార్ హారతి, 10.01 గంటలకు ధ్వజారోహణ, శిఖర పూజ, రాత్రి 8 గంటలకు కుంకుమార్చన, 15న 3.16 గంటలకు శ్రీ మాతేశ్వరి ఘటస్థాపన ఊరేగింపు, 16న శ్రీ మాతేశ్వరీ పూజ, 6.30 గంటలకు తొట్టెల ఊరేగింపు, 17న శ్రీ కోట మైసమ్మ మాతేశ్వరీ రంగం, 2 గంటలకు శ్రీ కోట మాతేశ్వరి ఘటం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.



టోల్‌గేట్ ఎంట్రీ వద్ద రోడ్డు వేస్తున్న అధికారులు

నార్సింగి టోల్‌గేట్‌కు తుది మెరుగులు

మణికొండ: నార్సింగి నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు ఎక్కే అవకాశం కలగనుంది. నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కొత్తగా ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కేందుకు, దిగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అందుకు అవసరమైన పనులను గతంలోనే పూర్తి చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోనే కోకాపేట వద్ద మరో ఎగ్జిట్ పాయింట్‌ను ఏర్పాటు చేసి రెండింటిని ఒకేసారి ప్రారంభించాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు ఆగారు. అయితే కోకాపేట వద్ద పనులు పూర్తయ్యేందుకు మరిన్ని నెలలు పట్టే అవకాశం ఉండటంతో ముందుగా నార్సింగి టోల్‌గేట్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. దాంతో నార్సింగి టోల్‌గేట్ వద్ద పనులను హెచ్ఎండీఏ అధికారులు చకచకా పూర్తి చేస్తున్నారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ ఔటర్ టోల్‌గేట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.



